బీఆర్ఎస్ గురుకుల బాట

ముద్ద అన్నం తింటరా?

- అధికారుల తీరుపై మాజీ ఎమ్మెల్యే గండ్ర ఆగ్రహం
- గురుకుల బాటలో భాగంగా శాయంపేట జ్యోతిబాపూలే గురుకులం ఆకస్మిక తనిఖీ

ముద్దగా ఉన్న అన్నాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

శాయంపేట, నవంబర్ 30 : 'ముద్దలా ఉన్న అన్నం మీరు తింటరా? మనమైతే ఇంట్లో ఈ తిండి తింటామా? చెప్పండి' అని శాయంపేట మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులం ప్రిన్సిపాల్ రేవతిని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రశ్నించారు. పిల్లలకు కనీసం ఆరు నెలల పాత బియ్యం ఇవ్వాల్సింది పోయి కొత్త బియ్యం ఇస్తే తింటరా? ప్రభుత్వానికి చెప్పండి.. అని సూచన చేశారు. బీఆర్ఎస్ గురుకుల బాటలో భాగంగా మాజీ ఎమ్మెల్యే గండ్ర శనివారం హనుమకొండ జిల్లా శాయంపేటలోని జ్యోతిబాపూలే బాలుర గురుకులాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గురుకుల స్కూళ్లలో ఫుడ్‌పాయిజన్ జరిగి విద్యార్థులు చనిపోవడం బాధాకరమని అన్నారు. 7వ తేదీ వరకు బీఆర్ఎస్ నిర్వహించనున్న గురుకుల బాటతో సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. 9 నుంచి అసెంబ్లీ ఉన్నదని, అందులో సమస్యలను లేవనెత్తుతామని పేర్కొన్నారు. అనంతరం మండలంలోని పెద్దకోడెపాక హైస్కూల్‌కు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. స్కూల్‌లో నాణ్యమైన భోజనం అందకపోవడంతో విద్యార్థులు ఇంటి నుంచి టిఫిన్ బాక్సులను తెచ్చుకోవడం బాధాకరమని అన్నారు.

వంట గదులు ఇట్లనే ఉంటయా?

- మీ పిల్లలకు ఇలాగే వండిపెడతారా?
- మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ ఫైర్
- మానుకోట జిల్లాలోని ఏకలవ్య గురుకులం సందర్శన
- డైనింగ్ హాల్‌లో వ్యర్థపదార్థాలపై ఆగ్రహం
- మేమున్నాం అంటూ విద్యార్థులకు భరోసా

కురవిలో ఏకలవ్య మాడల్ స్కూల్‌లో వంటగది అపరిశుభ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న సత్యవతి రాథోడ్

కురవి, నవంబర్ 30 : 'వంట గదులు ఇట్లనే ఉంటయా? మీ పిల్లలకు ఇలాగే వండి పెడతారా? విద్యార్థులను కనీసం మనుషుల లెక్క చూడకపోతే ఎలా?' అంటూ మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ఏకలవ్య మాడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఈఎంఆర్ఎస్)ను శనివారం ఉదయం ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల పరిసరాలతోపాటు డైనింగ్‌హాల్‌ను పరిశీలించారు. ఎటు చూసినా చెట్ల పొదలు కనిపించడంతో ప్రిన్సిపాల్ ప్రదీప్‌కర్ణంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. విద్యార్థినులు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌తో కలిసి టిఫిన్ చేశారు. సమస్యలపై విద్యార్థినులతో మాట్లాడారు. డైనింగ్ హాలులో రెండు రోజులుగా వ్యర్థ పదార్థాలు ఉంచడం, అందులో నుంచి దుర్వాసన రావడంపై సిబ్బందిపై మండిపడ్డారు. మురుగు నీరు నిల్వ ఉన్నా పట్టించుకోకుండా ఎందుకు ఉద్యోగాలు చేస్తున్నారని, ఇలాంటి వాతావరణంలో పిల్లలు భోజనం చేస్తే వారి ఆరోగ్యం బాగుంటుందా? అంటూ ప్రశ్నించారు. గురుకులంలో నెలకొన్న సమస్యలపై పెదవి విరిచిన ఆమె వెంటనే ఆర్సీవోకు ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌తో మాట్లాడారు. వసతులు సరిగా లేకపోవడంతో 500 మందికిపైగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రం మొత్తం ఫుడ్ పాయిజన్‌తో అల్లాడుతుందని, పట్టించుకోకపోతే అన్ని గురుకులాలు అలాగే తయారవుతాయని చెప్పారు. 'మేమున్నాం.. అధైర్య పడొద్దు' అంటూ విద్యార్థినులకు ఆమె భరోసానిచ్చారు.

చిన్న పిల్లలు పిట్టల్లా రాలుతున్నా పట్టదా?

గురుకులాల్లో చదువుకుంటున్న చిన్న పిల్లలు పిట్టల్లా రాలుతుంటే మహిళా మంత్రులు ఇష్టం వచ్చినట్టుగా రోజుకోమాట మాట్లాడటంపై సత్యవతి రాథోడ్ మండిపడ్డారు. మాడల్‌ను సందర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో గురుకులాలు పర్యవేక్షణ లేక పడావుపడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. ఫుడ్ పాయిజన్‌లో గురుకులాల సెక్రటరీగా గతంలో పనిచేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రమేయం ఉన్నదని మంత్రి కొండా సురేఖ మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని మండిపడ్డారు. నిరాధార ఆరోపణలు చేయకుండా ఇకనైనా బుద్ధితెచ్చుకొని మంచిగా పని చేయాలని హితవు పలికారు. విద్యార్థుల సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో సీఎం దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

చలి వణుకు

	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	10.7°c	28.3°c
హైదరాబాద్	15.0°c	28.7°c
రంగారెడ్డి	15.9°c	34.5°c
మహబూబ్‌నగర్	16.0°c	28.0°c
మెదక్	16.3°c	35.0°c
కరీంనగర్	20.0°c	28.0°c
నల్లగొండ	20.4°c	28.0°c
వరంగల్	21.0°c	27.0°c
నిజామాబాద్	21.5°c	29.2°c
ఖమ్మం	29.0°c	17.0°c

నేరడిగొండలోని కేజీబీవీలో విద్యార్థినులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నాణ్యమైన భోజనం అందించాలి

- ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే అనిల్ ఆదేశం
- నేరడిగొండ కేజీబీవీ సందర్శన
- సొంత డబ్బులతో దుప్పట్లు అందజేత

ఆదిలాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అధికారులకు సూచించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు ఆదిలాబాద్ జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు శనివారం గురుకుల పాఠశాలలను సందర్శించారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించారు. విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వంట గదిని పరిశీంచారు. మెరుగైన భోజనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లాలో చలి తీవ్రత అధికంగా ఉండటంతో విద్యార్థినులు ఇబ్బందులు పడకుండా సొంత డబ్బులతో దుప్పట్లు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. పిల్లలకు మంచి విద్యను అందించాలని, అనారోగ్యానికి గురైతే దవాఖానకు తీసుకెళ్లి మంచి వైద్యం అందించాలని సూచించారు. జిల్లాలో ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా నియోజకవర్గంలో 3వేల మందికి సొంత డబ్బులతో దుప్పట్లు పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తెలిపారు.

కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లి వద్ద అరెస్ట్ చేసేందుకు వచ్చిన పోలీసులతో మాజీ మంత్రి కొప్పుల వాగ్వాదం

చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

బీఆర్ఎస్ గురుకుల బాటకు అడ్డంకులు

- ఓవైపు నిర్బంధం.. మరోవైపు అరెస్టులు
- మాజీ మంత్రి కొప్పుల గృహ నిర్బంధం
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అరెస్టు
- పోలీసులతో నాయకుల వాగ్వాదం

కరీంనగర్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ)/ రాయికల్ : బీఆర్ఎస్ చేపట్టిన గురుకుల బాటకు పోలీసులు అడ్డంకులు సృష్టించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌లో గురుకుల బాటకు బయలుదేరగా పోలీసులు పెద్ద సంఖ్యలో వచ్చి చుట్టుముట్టారు. వివరాలు ఇలా.. కరీంనగర్‌లోని శ్రీపురం కాలనీలోని తన నివాసం నుంచి శనివారం ఉదయం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ బయలుదేరారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని రుక్మాపూర్, చొప్పదండి పట్టణం, మల్లాపూర్, అల్లీపూర్, ధర్మపురి తదితర గురుకుల పాఠశాలల్లో పరిస్థితిని తెలుసుకునేందుకు ఆయన సుంకె రవిశంకర్‌తో కలిసి షెడ్యూల్ నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా కొప్పుల ఈశ్వర్ చొప్పదండి మండలం రుక్మాపూర్‌లో సుంకె రవిశంకర్‌ను కలుసుకుని స్థానికంగా ఉన్న ఒక గురుకులాన్ని పరిశీలించాలి. అప్పటికే చొప్పదండి మండలం రుక్మాపూర్ చేరుకున్న సుంకె రవిశంకర్ స్థానిక మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో టీ తాగుతుండగా సుమారు 100 మంది పోలీసులు చుట్టుముట్టారు. రవిశంకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అదే సమయంలో తన నివాసం నుంచి బయలుదేరి కరీంనగర్ మండలం నగునూర్ వరకు వచ్చిన కొప్పుల ఈశ్వర్‌కు సుంకె అరెస్ట్ విషయం తెలియడంతో మరో మార్గంలో మల్లాపూర్ వెళ్లేందుకు ప్రయత్నించారు. విషయం తెలిసి పోలీసు వాహనాలు ఆయన కాన్వాయిని వెంబడించాయి. కరీంనగర్ సమీపంలోని తీగలగుట్టపల్లికి చేరుకోగానే ఓవర్‌టేక్ చేసి అడ్డుకున్నారు. సీపీ అనుమతితో పోలీసులు కొప్పులను శ్రీపురంకాలనీలోని తన ఇంటికి తీసుకువచ్చి గృహ నిర్బంధం చేశారు. కాగా, రుక్మాపూర్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌ను అరెస్టు చేసిన పోలీసులు రామడుగు పోలీసు స్టేషన్‌కు తరలించి, మధ్యాహ్నం 3 వరకు నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పోలీసు స్టేషన్‌కు వచ్చి రవిశంకర్‌కు సంఘీభావం తెలిపారు.

అల్లీపూర్ గురుకులం ఎదుట ధర్నా

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం అల్లీపూర్ బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల సందర్శన కోసం వెళ్లగా పాఠశాల సిబ్బంది గేట్లకు తాళం వేసి ఆవరణలోకి రానివ్వకపోవడంతో బీఆర్ఎస్ నాయకులు ధర్నాకు దిగారు. జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంతతోపాటు నాయకులు పాఠశాల ఎదుట కూర్చుని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. అనంతరం ప్రహరీ పక్కన చిన్న దారి నుంచి లోపలికి వెళ్లి విద్యార్థులకు అందుతున్న వసతులు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

బండ్‌లో భాగంగా ఖమ్మం నగరంలోని రికాబ్‌బజార్ ప్రభుత్వ పాఠశాలకు తాళం వేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ఇంకెంతకాలం పురుగుల అన్నం?

- ఫుడ్ పాయిజన్‌కు సీఎందే బాధ్యత
- సర్కారుపై విద్యార్థి సంఘాల ఆగ్రహం
- ఖమ్మం బంద్ సక్సెస్.. జిల్లాలో ర్యాలీలు

రఘునాథపాలెం, నవంబర్ 30: ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు, విద్యార్థుల మరణాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ నేతలు డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో విద్యాసంస్థల రాష్ట్ర బంద్‌లో భాగంగా శనివారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించి ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, పాఠశాలలను బంద్ చేయించారు. ఖమ్మంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు ఇటికాల రామకృష్ణ, తుడుం ప్రవీణ్, వెంకటేశ్, మస్తాన్ మాట్లాడుతూ.. అధికారం చేపట్టి ఏడాది కావొస్తున్నా ఇంకెంతకాలం ఈ పురుగుల అన్నం, నీళ్ల చారు పెడతారని ప్రశ్నించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తామంటూ అధికారంలోకి వచ్చిన ఈ ప్రభుత్వం.. విద్యారంగాన్ని విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి విడనాడాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రిని కేటాయించకుండా, విద్యారంగంపై సమీక్ష నిర్వహించకుండా ప్రభుత్వం విద్యరంగాన్ని ఎలా బలోపేతం చేస్తుందని ప్రశ్నించారు.

కోఠి ఉమెన్స్ వర్సిటీ విద్యార్థుల ఆందోళన

- చాకలి ఐలమ్మ పేరును యూజీసీలో చేర్చాలని డిమాండ్

సుల్తాన్‌బజార్, నవంబర్ 30: హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ మహిళా యూనివర్సిటీ పేరును యూజీసీలో చేర్చాలని డిమాండ్ చేస్తూ విద్యార్థినులు శనివారం ఆందోళనకు దిగారు. చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంగా మార్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారికంగా యూజీసీలో చేర్చకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని వారు మండిపడ్డారు. తమ ఐడీ కార్డుల్లో తెలంగాణ మహిళా యూనివర్సిటీగానే ఉండటంతో భవిష్యత్తులో ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సర్టిఫికెట్లలో కూడా గందరగోళం నెలకొంటుందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని రానున్న శీతాకాలం అసెంబ్లీ సమావేశాల్లో వర్సిటీ పేరును యూజీసీలో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీసీ సూర్యా ధనుంజయ్ అక్కడికి చేరుకుని విద్యార్థుల డిమాండ్‌ను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.



కోఠి మహిళా యూనివర్సిటీ ముందు ఆందోళనకు దిగిన విద్యార్థినులు

విద్యార్థులు చస్తున్నా పట్టదా?

మొదటిపేజీ తరువాయి...

ఉండాలో ఒక స్పష్టమైన ఆలోచనతో, శిథిలమవుతున్న ఈ తరాన్ని కాపాడుకోవడం కోసం కేటీఆర్ గురుకులాల బాట కార్యక్రమానికి పిలుపునిచ్చారని చెప్పారు. తెలంగాణభవన్‌లో శనివారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు తుంగ బాలు, రంగినేని అభిలాష్, గదరాజు చందర్, రవీందర్‌రెడ్డి, పరశురామ్, విజయ్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఫుడ్ పాయిజన్ గురించి మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు కనీస అవగాహన లేదని మండిపడ్డారు. 'మీకు చేతకాకపోతే విద్యాశాఖను బీఆర్ఎస్ పార్టీకి అప్పగించండి' అని హితవుపలికారు. విద్యాశాఖ మంత్రి అయిన రేవంత్‌రెడ్డి, గురుకులాల పట్ల అవగాహన లేని కొందరు మంత్రులతో రకరకాల వేదికల మీద మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. రోజూ బీర్లు, బిర్యానీల గురించి వీడియోలు చేసే కొండా సురేఖకు, ఆకలితో అలమటిస్తూ, విషాహారం తిని దవాఖానల పాలవుతున్న పేద విద్యార్థుల బాధలు అర్థమవుతాయా? అని ప్రశ్నించారు. 'దమ్ముంటే మీరు (సీఎం రేవంత్‌రెడ్డి) గురుకులాల మీద బహిరంగ చర్చకు రండి. అంతేకాని భజంత్రీలను పంపించి నవ్వులపాలు కాకండి' అని సవాల్‌చేశారు. 'మానవత్వం అంటే ఏమిటో తెలియని మీకు (సురేఖ).. బీర్లు, బిర్యానీలు మాత్రమే తెలిసిన మీకు.. నా గురించి గాని, గురుకుల పేద విద్యార్థుల గురించి గాని మాట్లాడే అర్హత ఏమాత్రం లేదు' అని నిప్పులు చెరిగారు. మంత్రి సురేఖ భర్త కొండా మురళి వరంగల్‌లో ఎంతో మంది అమ్మాయిలు, విద్యార్థినుల మీద అఘాయిత్యాలు చేసి వాళ్ల జీవితాలు నాశనం చేశాడని ప్రవీణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. వరంగల్‌లోని గెస్ట్‌హౌసుల గోడలే కొండా మురళి దారుణాలకు మౌనసాక్షిగా ఉన్నాయని విమర్శించారు. అతడి అరాచకాలు భరించలేక 2002లో నాటి జిల్లా ఎస్పీ నళిన్‌ప్రభాత్ హన్మకొండ చౌరస్తాలో మురళికి బహిరంగంగా కౌన్సెలింగ్ ఇచ్చారని గుర్తుచేశారు. దానికి సాక్ష్యం అప్పుడు సీఐగా ఉన్న ప్రస్తుత వర్ధన్నపేట కాంగ్రెస్ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి పిల్లలు చనిపోవాలా? : బాల్క సుమన్

రేవంత్‌రెడ్డి నయా దేశ్‌ముఖ్‌గా వ్యవహరిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విమర్శించారు. రేవంత్‌రెడ్డి విద్యాశాఖను, సంక్షేమ శాఖను తన వద్ద పెట్టుకొని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలు, శక్తులతో సీఎం రేవంత్‌రెడ్డి కుమ్మక్కై.. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ విద్యార్థులు ఎక్కువగా చదువుకుంటున్న గురుకులాలను నీరుగారుస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో 886 మంది విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారని, 49 మంది చనిపోయారని, వీరిలో 23 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌కు ఓటేసిన పాపానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ పిల్లలను చంపుతారా? అని నిలదీశారు. రేవంత్‌రెడ్డి శిఖండి రాజకీయాలు చేస్తూ.. మంత్రులతో మాట్లాడిస్తున్నారని విమర్శించారు. హాస్టళ్లు, గురుకులాలు మంచిగా ఉంటే తామెందుకు గురుకుల బాట చేపడతామని ప్రశ్నించారు.

డిసెంబర్ 7 వరకు గురుకుల బాట

శనివారం నుంచి డిసెంబర్ 7 వరకు బీఆర్ఎస్వీ గురుకులాల బాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. 33 బృందాలు 33 జిల్లాల్లోని ప్రభుత్వ స్కూళ్లు, హాస్టళ్లు, గురుకులాలను సందర్శిస్తాయని తెలిపారు. సమస్యలపై నివేదికను కేటీఆర్‌కు అందజేస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో విద్యార్థుల సమస్యలపై బీఆర్ఎస్ లేవనెత్తుతుందని చెప్పారు. బీఆర్ఎస్‌పై కోపాన్ని విద్యార్థులపై చూపిస్తున్నారని, ఫుడ్ పాయిజన్‌తో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలను మంత్రులు ఎందుకు పరామర్శించడం లేదని నిలదీశారు. ఫుడ్‌సేఫ్టీ విభాగంలో విద్యార్థులు ఉండేలా చూడాలని సూచించారు.

తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ గురుకుల హెల్ప్‌లైన్ నంబర్‌ను చూపుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్. చిత్రంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్

> నేను ప్రభుత్వ హాస్టల్స్‌లో చదువుకొని ఐపీఎస్ అయిన. దేశ రక్షణ కోసం పనిచేసిన. అనేక అవార్డులు అందుకున్న. ఏడేండ్ల సర్వీసును వదిలి రాజకీయాల్లోకి వచ్చిన. తొమ్మిదేండ్లు గురుకులాల కార్యదర్శిగా ఉన్న. నా రికార్డులు సంక్షేమభవన్‌లో భద్రంగా ఉన్నయి. అధికారం మీ చేతుల్లో ఉంది. ఏసీజీ మీ చేతుల్లోనే ఉంది. ఎలాంటి విచారణకైనా నేను సిద్ధం. తప్ప చేశానని తేలితే జైలుకు వెళ్లేందుకైనా, ఉరికంభం ఎక్కేందుకైనా రెడీ.
>
> -ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

గురుకుల సమస్యలపై హెల్ప్‌లైన్ 8522044336

రాష్ట్రవ్యాప్తంగా గురుకులాల్లో ఎలాంటి సమస్యలున్నా బీఆర్ఎస్వీ హెల్ప్‌లైన్ నంబర్ 8522044336కు వాట్సాప్ మెసేజ్ చేయాలని డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విజ్ఞప్తిచేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలకు సంబంధించిన ఫొటోలు, మెస్సేజ్‌లను ఈ నంబర్‌కు పంపాలని సూచించారు. అనంతరం 'గురుకుల బాట'కు బయలుదేరిన బీఆర్ఎస్వీ నాయకుల వాహనాలను తెలంగాణభవన్‌లో జెండాఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలను పట్టించుకోరా?

విద్యార్థుల ప్రాణాలు పోతున్నా ఇంత నిర్లక్ష్యమా

కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆర్ కృష్ణయ్య ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): గురుకుల విద్యార్థులు చనిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోదా అని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య ప్రశ్నించారు. హాస్టళ్లపై ఇంత నిర్లక్ష్యం ఎందుకని నిలదీశారు. ఇకనైనా సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని, గురుకులాల పనితీరుపై సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీఎంకు లేఖ రాశారు. 'ఈ విద్యా సంవత్సరంలో 42 మంది విద్యార్థులు చనిపోయారు. దాదాపు 1200 మంది విద్యార్థులు దవాఖాన పాలయ్యారు. కాబట్టి గురుకులాల సమస్యను రాజకీయ కోణంలో చూడకుండా తక్షణం చర్యలు తీసుకోవాలి. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని, ప్రజల్లో విశ్వాసం కలిగించేలా ప్రభుత్వం పనిచేయాలి. పాఠశాలలు, హాస్టళ్ల నిర్వహణపై ఉన్నతస్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించి సంస్కరణలు చేపట్టాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. బీసీ హాస్టళ్లలో వర్కర్లను శాశ్వత ప్రాతిపదికన నియమించాలని, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టును గ్రేడ్-1 గా అప్‌గ్రేడ్ చేయాలని కోరారు.

విద్యార్థుల మరణాలపై హెచ్ఆర్సీలో ఫిర్యాదు

యాచారం, నవంబర్ 30 : గురుకులాల్లో విద్యార్థుల వరుస మరణాలను పట్టించుకోని సీఎం రేవంత్‌రెడ్డి సర్కారుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ విద్యార్థి నాయకులు శనివారం మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. విద్యార్థుల ఆత్మహత్యలు, ఫుడ్ పాయిజన్ ఘటనలపై నిర్లక్ష్యంగా ఉండటంతోపాటు శానిటేషన్ కాంట్రాక్టర్లకు పెండింగ్ బిల్లులను చెల్లించలేని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ సర్కారుపై మానవ హక్కుల కమిషన్‌లో నాగోల్‌కు చెందిన విద్యార్థి నాయకుడు నాయిని శరత్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల మరణాలకు రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఎంతో మెరుగ్గా ఉన్న గురుకులాలు ప్రస్తుత సర్కార్ హయాంలో అధ్వానంగా తయారైనట్టు చెప్పారు. ఏడాది కాలంలోనే 50 మంది విద్యార్థులు మరణించడం ఎంతో బాధాకరమని అన్నారు. గతంలో గురుకుల సీట్ల కోసం పోటీపడిన విద్యార్థులు నేడు దవాఖానల్లో బెడ్ల కోసం పోటీ పడాల్సిన దుస్థితి నెలకొందని తెలిపారు.

విద్యార్థినులతో టీచర్ అసభ్య ప్రవర్తన

నిడమనూరు, నవంబర్ 30 : ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు ఆదర్శ పాఠశాలలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఉపాధ్యాయుడి వ్యవహార శైలితో విసిగిపోయిన విద్యార్థినులు తల్లిదండ్రులకు తెలుపడంతో శనివారం వారు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. సాంఘికశాస్త్రం బోధించే ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులు రెండు నెలల క్రితం బదిలీల్లో భాగంగా నిడమనూరు ఆదర్శ పాఠశాలకు వచ్చాడు. 6,7,8వ తరగతుల విద్యార్థులకు బోధిస్తున్నాడు. సబ్జెక్టుకు సంబంధం లేని అశ్లీల మాటలతో అనుచితంగా ప్రవర్తించడం విద్యార్థినులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అక్కడక్కడ చేతులు వేస్తూ పుట్టుమచ్చలు చూపించాలనడంతో వారు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఉపాధ్యాయుడి తీరుపై పలువురు విద్యార్థినులు ప్రిన్సిపాల్ నిర్మలకు రెండు రోజుల క్రితమే ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులకు కూడా చెప్పడంతో వారు శనివారం ఎస్ఎఫ్ఐ నేతల ఆధ్వర్యంలో పాఠశాలకు వచ్చి ఆందోళనకు దిగారు. ప్రిన్సిపాల్ నిర్మల వారికి సచ్చజెప్పే ప్రయత్నం చేశారు. నాగార్జున సాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి మధ్యాహ్నం పాఠశాలను సందర్శించారు. ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులతో మాట్లాడి ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తనపై అసహనం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరపాలని కలెక్టర్‌తోపాటు మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్ రాజును ఆదేశించారు.

అసభ్య ప్రవర్తన అవాస్తవం: ఉపాధ్యాయుడు

తాను విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్టు వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని ఉపాధ్యాయుడు దొడ్డా ఆంజనేయులు తెలిపారు. చనువుగా ఉండటం వల్ల విద్యార్థినులు అపార్థం చేసుకున్నారని, సబ్జెక్టు కాని విషయాలను విద్యార్థినులతో చర్చించలేదని తెలిపారు.

పాల సరఫరాలో జాప్యం వద్దు: సీతక్క

హైదరాబాద్, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ): అంగన్‌వాడీ కేంద్రాలకు పాల సరఫరాలో జాప్యం వద్దని మంత్రి సీతక్క సూచించారు. జాప్యాన్ని ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుంటుందని హెచ్చరించారు. శనివారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించిన ఆమె మాట్లాడుతూ 'ఇండెంట్ ప్రకారం పాలు సరఫరా చ